సాక్షి
తిరుపతి

శుక్రవారం । 5 । జూలై । 2024



అల్లూరికి నివాళులు

దేశం కోసం సర్వస్వం కోల్పోయిన అల్లూరిని స్మరించుకోవడం మన బాధ్యత అని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. - 8లో



స్వయం ఉపాధితోనే అభ్యున్నతి

మహిళలకు సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం ముగిసింది. - 8లో



మీ పిల్లలకీ ఇదే పెడతారా ?

మీ పిల్లలకూ వాసన వస్తున్న భోజనాన్నే పెడతారా ? అని ఎస్వీయూ హాస్టల్ విద్యార్థినులు వర్సిటీ అధికారులను నిలదీశారు. - 8లో

న్యూస్‌రీల్

ఉచితంగా యాంటీరేబిస్ టీకాలు రేపు



పశువైద్య చికిత్స విభాగాధిపతి డాక్టర్ వైకుంఠరావు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవ సందర్భంగా మూడు నెలలు వయసు దాటిన పెంపుడు శునకాలకు, పిల్లులకు యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు పశువైద్య చికిత్స విభాగాధిపతి డాక్టర్ వైకుంఠరావు తెలిపారు. గురువారం వర్సిటీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్సిటీలోని పశువైద్య చికిత్సా కేంద్రంలో, నగరంలోని తాతయ్యగుంటలోని పట్టణ పశువైద్యశాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి టీకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సదావకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన

ఏర్పేడు: మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు భారతదేశ కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహనా సదస్సు జరుగుతుందని డైరెక్టర్ కేఎన్‌సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టు అదనపు సొలిసిటర్ జనరల్ బీ.నరసింహ శర్మ హాజరుకానున్నట్లు వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10 నుంచి పీజీ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో పీజీ ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 10వ తేదీ నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లా నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 సెంటర్లలో ఈ పరీక్షలు జరగనున్నట్లు చెప్పారు. సుమారు 3వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా కళాశాలల యాజమాన్యాలకు పరీక్షల షెడ్యూల్‌తో పాటు టైం టేబుల్‌ను పంపడం జరిగిందన్నారు.

నాలుగు మాడవీధుల్లో ఫ్లెక్సీలు నిషేధం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నాలుగు మాడవీధులు, సన్నిధివీధి, టూరిస్టు బస్టాండు వరకు ఫ్లెక్సీల ఏర్పాటును ఈ నెల 1 నుంచి నిషేధిస్తున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాజకీయ నాయకులు, వ్యాపార ప్రకటనలు, పుట్టినరోజు శుభాకాంక్షలు వంటి అన్ని రకాల బ్యానర్లు, ఫ్లెక్సీలు, ఆర్చీలు ఏర్పాటు చేయకూడదన్నారు. చేసే వాటిని జప్తు చేసి రూ.వెయ్యి జరిమానాతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారం అండ చూసుకుని కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా తిరుపతిలో వివాదాస్పద స్థలాలపై కన్ను వేసి వాటిని కబ్జా చేసే యత్నం చేస్తున్నారు. వారు చేసే అన్యాయాలు, అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకు పచ్చ మీడియాను అడ్డు పెట్టుకుని తిరుపతి నగరానికే తలమానికంగా నిలుస్తున్న మాస్టర్‌ప్లాన్ రోడ్లపై విషం చిమ్ముతున్నారు.

తిరుపతిలో భవన యజమానిపై టీడీపీ నేత అన్నారామచంద్రయ్య, ఆయన అనుచరులు దాడికి పాల్పడుతున్న దృశ్యాలు(ఫైల్)









దౌర్జన్య కూటమి

- అధికార అండతో తిరునగరిలో రెచ్చిపోతున్న కూటమి శ్రేణులు
- తన స్థలాన్ని కాపాడుకునేందుకు టీడీపీ నేత దౌర్జన్యం
- నిబంధనలకు విరుద్ధంగా భవనం కూల్చివేతకు కుట్ర
- నగరంలో వివాదాస్పద స్థలాలపైనా జనసేన, టీడీపీ నేతల కన్ను
- అక్రమాలు, దౌర్జన్యాలను మరిపించేందుకు మాస్టర్‌ప్లాన్‌పై విషప్రచారం
- రోడ్లు వేయడమే నేరం అనేలా రోజూ అసత్య ప్రచారాలు



ఎలక్ట్రిక్ విభాగం వారు తవ్వేస్తే రోడ్డు కుంగిందట..మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి


సాక్షి టాస్క్‌ఫోర్స్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఆధ్యాత్మిక నగరంలో అధికారమే అండగా కూటమి శ్రేణులు కొందరు రెచ్చిపోతున్నారు. తన స్థలాన్ని కాపాడుకునేందుకు టీడీపీ నేత అన్నా రామచంద్రయ్య ఓ భవనాన్నే కూల్చివేసేందుకు కుట్రలకు తెరలేపారు. జనసేనకు చెందిన ఇద్దరు నాయకులు తిరుపతి నగరంలో వేరొకరి ఆధీనంలో ఉన్న వివాదాస్పద స్థలాలపై దృష్టి సారించారు. నయానో భయానో తమ సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. కూటమి నేతల దౌర్జన్యాలు, సెటిల్‌మెంట్లు ప్రచారంలోకి రాకుండా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ నేతలపై విషప్రచారాలకు తెరతీశారు. ముఖ్యంగా మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేయడమే పెద్ద నేరంగా తమ అనుకూల మీడియా ద్వారా అసత్య కథనాలు రాయిస్తూ రాక్షసానందం పొందుతున్నారు. తిరుపతి నగరంలోని తిరుమల బైపాస్ మున్సిపల్ పార్క్ ఎదురుగా ఉన్న విరజా మార్గంలో టీడీపీ నేత అన్నా రామచంద్రయ్య స్థలం ఉంది. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఆ స్థలం మీదుగా రోడ్డు వేయాల్సి ఉంది. అదే జరిగితే విలువైన స్థలం కోల్పోవాల్సి వస్తుందని భావించిన టీడీపీ నేత.. పక్కనే ఉన్న శ్రీధర్ అనే వ్యక్తి భవనాన్ని కూల్చివేసి అందులో నుంచి రోడ్డు వేయించేందుకు కుట్రలకు తెరలేపారు. అందులో భాగంగా శ్రీధర్ నూతనంగా నిర్మించిన నాలుగు అంతస్తుల భవనంపై తన మనుషులతో మంగళవారం 15 అడుగుల పబ్లిక్ రోడ్డు అని రాయించారు. ఈ విషయంపై భవన యజమాని మాస్టర్ ప్లాన్ మ్యాప్‌ని, అందుకు సంబంధించిన ఆధారాలను అధికారులకు చూపించారు. ఈ విషయాన్ని స్పష్టం చేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు అధికారపార్టీ నేతల ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగి నోరెత్తలేదు. భవనాన్ని కూలదోసేందుకు వీల్లేదని, దౌర్జన్యం చేస్తే న్యాయస్థానానికి వెళ్లేందుకు సిద్ధం అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేత అన్నా రామచంద్రయ్య తన మనుషులతో భవనం వద్ద పనులు చేసుకుంటున్న యజమానిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడి ఘటన సీసీ పుటేజీలో రికార్డు కావడంతో ఆ వీడియోలు బయటకు వచ్చాయి. మరోవైపు జనసేన నేతలు ఇద్దరు నగరంలో తిష్టవేసి వివాదాస్పద స్థలాలు తమ సొంతం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. శ్రీనివాసపురం, తిరుచానూరు, తిరుపతి–కరకంబాడి మార్గంలో ఇరువర్గాల మధ్య నలుగుతున్న విలువైన స్థలం పంచాయతీ వారి వద్దకు వెళ్లింది. అధికార పార్టీకి చెందిన వారు కావడంతో వివాదంలో ఉన్న ఆ స్థలాల విషయంపై మధ్యస్థం చేసి పరిష్కరిస్తారని ఇరు వర్గాల వారు ఆ నాయకులను ఆశ్రయించారు. అయితే డబ్బులు ఇచ్చేస్తాం, ఆస్థలాలను విడిచిపెట్టమని తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మాస్టర్‌ప్లాన్ రోడ్లతో..

నగరంలో మాస్టర్‌ప్లాన్ రహదారులు ఏర్పాటు చేయడంతో నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టినట్లైంది. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న చింతలచేను, కొంకచెన్నాయిగుంట, కొరమేనుగుంట ప్రాంతాలకు వెళ్లాలంటే ఇరుకు రోడ్లతో నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అటువంటి ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ రోడ్లు వేయడంతో ఇది తిరుపతేనా ? అనేరీతిలో అభివృద్ధి చెందాయి. గత ఐదేళ్లలో ఇంత అభివృద్ధి చెందినందుకు సంతోషించాల్సింది పోయి.. కూటమి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. నిత్యం మాస్టర్‌ప్లాన్ రహదారులపై అదేపనిగా అసత్య ప్రచారాలు చేస్తూ ఆధ్యాత్మిక నగరానికి అపకీర్తి తెచ్చేలా రాతలు రాస్తున్నారు. తాజాగా కులశేఖర ఆళ్వార్ మాస్టర్ ప్లాన్ రోడ్డు అప్పుడే గోతులు పడ్డాయని అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ఆ రహదారిలో మరమ్మతులకు కారణం ఎలక్ట్రికల్ విభాగ పనులే కారణమని నిర్ధారణ అయింది. సరైన అవగాహన లేక, మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అనుమతులు లేకుండానే ఎలక్ట్రికల్ విభాగం అక్కడ పనులను చేపట్టింది. ఎలక్ట్రికల్ పనులు పూర్తయ్యాక సరైన ప్యాచ్ వర్క్ చేయకపోవడంతోనే గుంతలమయంగా మారింది. ఈ క్రమంలో అక్కడ జరుగుతున్న పనులను బుధవారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ తుడా చైర్మన్ నరసింహ యాదవ్, ఎస్ఈ మోహన్, డీఈ విజయ్‌కుమార్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అక్కడ పనులు చేపట్టిన ఎలక్ట్రికల్ ఇంజినీర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణంలో లోపం లేదని, ఎలక్ట్రికల్ పనుల్లో భాగంగా జరిగిన తప్పిదాలే కారణమని నిర్ధారణకు రావడంతో అసత్య ప్రచారం చేసిన వారి నోటి నుంచి మాట రాకపోవడం గమనార్హం.

మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేయడమే నేరమా..?



తిరుపతిలో వేసిన మాస్టర్‌ప్లాన్ రోడ్లు

శ్రీవారి భక్తులతో తిరుపతి, తిరుమల నిత్యం రద్దీగా ఉంటాయి. విశిష్ట ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన నగరాన్ని దశాబ్దాల కాలంగా గత పాలకులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచారు. గతంలో టీడీపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రోడ్లు వేయాలని సంకల్పించింది. ఇందుకోసం ఇంజినీర్లతో ప్లాన్ రూపొందించినా క్షేత్రస్థాయిలో అమలు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనతో భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి నగర అభివృద్ధిపై దృష్టి సారించారు. అందులో భాగంగా వారు ప్రత్యేక చొరవతో మాస్టర్‌ప్లాన్ రహదారుల పేరుతో కొత్తగా 18 రోడ్లు ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలో తయారు చేసిన ప్లాన్ ప్రకారం రోడ్లు వేసే క్రమంలో కొన్ని ప్రాంతాల్లో టీటీడీకి సంబంధించిన స్థలాలను తీసుకోవాల్సి వచ్చింది. స్థానికులను ఒప్పించి స్థలాలు తీసుకుని, వారికి నష్టపరిహారం చెల్లించి 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లు, ఫ్లైఓవర్లు ఏర్పాటు చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. నష్టపరిహారం ఇచ్చినా కూడా ఇవ్వలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ తిరుపతి రూపురేఖలు వైఎస్సార్‌సీపీ పాలనలో మారాయనడంలో సందేహమే లేదు.

నగరానికే తలమానికంగా..

తిరుపతి నగరంలో నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్లు తిరుపతి ఆధ్యాత్మిక నగరానికే తలమానికంగా నిలిచాయి. మాస్టర్ ప్లాన్ రోడ్లు తిరుపతికి మరింత శోభను తెచ్చిపెట్టాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు సైతం తిరుపతిలో నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్లను చూసి ముక్కున వేలు వేసుకుంటున్నారు. గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధితో తిరుపతిలో నివాసం ఉన్నందుకు ఎంతో సంతోషంగా ఉంది.

– బాలాజీ, సంజయ్‌గాంధీ కాలనీ

స్వర్గధామంగా రోడ్లు..

ఇదివరకు తిరుపతి నగరం శ్రీవారి భక్తులు, నగర ప్రజలతో తిరుపతి నగరం కిటకిటలాడుతుండేది. తిరుపతిలో నిర్మించిన 18 మాస్టర్ ప్లాన్ రోడ్లతో ట్రాఫిక్ ఇబ్బందులకు స్వస్తి పలికాం. గతంలో తిరుపతి సిటీ దాటాలంటే గంటల వ్యవధి పట్టేది. ప్రస్తుతం పదే పది నిమిషాలు పడుతోంది. మాస్టర్ ప్లాన్ రోడ్లు శ్రీవారి భక్తులతో పాటు నగర ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి.

– పార్వతమ్మ, ఎంఆర్‌పల్లి

సందులు హైవేలుగా మారాయి..

మాస్టర్‌ప్లాన్ రోడ్లతో కొర్లగుంట మెయిన్‌రోడ్డు, గంగమ్మ ఆలయం నుంచి గ్రూప్ థియేటర్స్‌కు వెళ్లే మార్గం, సత్యనారాయణపురం, జీవకోన, ఎంఆర్‌పల్లి, శ్రీదేవి కాంప్లెక్స్ పక్కమార్గం వంటి ప్రాంతాల్లోని ఇరుకు సందులతో గతంలో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. మాస్టర్‌ప్లాన్ రోడ్లు నిర్మించిన తర్వాత వాహనాలు రాకపోకలతో పాటు ఒకేసారి నాలుగు అంబులెన్స్‌లు వచ్చే విధంగా మాస్టర్‌ప్లాన్ రోడ్లు నిర్మించారు.

– యశోద, శివజ్యోతినగర్

భూముల విలువ పెరిగింది..

గత 45 ఏళ్లలో ఎన్నడూ జరగనంతగా గత రెండేళ్లలో నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్లతో తిరుపతి రూపురేఖలే మారాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు సైతం తిరుపతి వైపు చూసే విధంగా మాస్టర్‌ప్లాన్ రోడ్లు నిర్మించారు. దీంతో తిరుపతి నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోని భూముల విలువ అమాంతం పెరిగింది. కేవలం రెండేళ్లలోనే 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లు నిర్మించడం అభినందనీయం.

– నారాయణ, కొర్లగుంట

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన జేసీ, తిరుపతి కమిషనర్, డీఆర్వో తదితరులు

- అధికారులు అందరికీ అందుబాటులో ఉండాలి
- శ్రీవారి చెంత పనిచేయడం ఎంతో అదృష్టం
- కుష్టు రహిత జిల్లాగా తిరుపతిని మార్చేద్దాం
- జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: అర్హులైన అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా సమర్థవంతంగా కృషి చేస్తామని నూతన కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ఉదయం 11.45 గంటలకు ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీవారి చెంత పని చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. తిరుపతి కలెక్టర్‌గా పని చేసే భాగ్యం లభిస్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తామని చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జాయింట్ కలెక్టర్ హోదాలో హౌసింగ్ విభాగాన్ని పర్యవేక్షించానని, జిల్లాల విభజన తర్వాత చిత్తూరులో జేసీ హోదాలో రెవెన్యూ విభాగం పర్యవేక్షించినట్లు చెప్పారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సందర్భంగా ప్రతి సమస్యకు పరిష్కారం చూపించే దిశగా చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా గ్రామ, వార్డుస్థాయిలో ప్రతి సోమవారం అర్జీలను స్వీకరించడంతో పాటు మండల, డివిజన్ స్థాయిలో అర్జీలను స్వీకరించాల్సి ఉందని వెల్లడించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో పాటు జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదిత్‌సింగ్, డీఆర్వో పెంచల కిషోర్, పలువురు జిల్లా అధికారులు, ఆర్డీఓలు, డివిజన్ అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తిరుపతి..

కుష్టువ్యాధి రహిత జిల్లాగా తిరుపతిని తీర్చిదిద్దాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం కుష్టు, ఎయిడ్స్, టీబీ వ్యాధుల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు పాఠశాలల్లో విద్యార్థులతో పాటు ఇంటింటికీ వ్యాధుల నివారణ చర్యల కు సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ధ్యానచంద్ర, నగరపాలక సంస్థ కమిషనర్ అదిత్ సింగ్, డీఆర్వో పెంచల కిషోర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, కుష్టు, ఎయిడ్స్, టీబీ జిల్లా అధికారి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ మురళి, డీఈఓ వి.శేఖర్, సమాచారశాఖ జిల్లా అధికారి బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా కలెక్టర్

పోరాట యోధుడు అల్లూరి

తిరుపతి అర్బన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట యోధుడని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అల్లూరి జయంతి వేడుకలు బీసీ వెల్ఫేర్ అధికారుల నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి, కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్, డీఆర్‌ఓ పెంచల కిషోర్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, సమాచార శాఖ జిల్లా అధికారి బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

'నీట్' లీకేజీ బాబు సర్కారుకు పట్టదా ?

- ఏపీ ప్రభుత్వం కూడా అసెంబ్లీలో నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయాలి
- నీట్ పరీక్ష తిరిగి నిర్వహించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- లీకేజీలు, కుంభకోణాలే మోదీ మేనిఫెస్టో
- జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతం
- ఎస్వీయూలో నీట్ లీకేజీపై కదం తొక్కిన ఐక్య విద్యార్థి సంఘాలు



ఎస్వీయూ పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాలు

తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం నీట్ పేపర్ లీకేజీపై స్పందించకపోవడం దారుణమని జిల్లా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. జాతీయ విద్యార్థి సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం జిల్లాలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాలు ఎస్వీయూలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ వైద్యవిద్యను వ్యాపారంగా చేసుకుని పేద విద్యార్థుల కడుపు కొడుతోందన్నారు. మోదీ సర్కారు ఇప్పటివరకు గత ఐదేళ్ల పాలనలో సుమారు 65 ప్రశ్నపత్రాలను లీకేజీ చేసిందన్నారు. లక్షల మంది విద్యార్థుల జీవితాలు నాశనమవుతుంటే మోదీ సర్కారు కనీసం స్పందించడం లేదని దుయ్యబట్టారు. ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.30 లక్షలు వసూలు చేసి పేపర్ లీకేజీ చేశామని నిందితులు బహిరంగంగా చెబుతున్నా వారిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక మోదీ సర్కారు ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి నీట్, నెట్ లీకేజీలతో సంబంధం ఉందనే విషయం తేటతెల్లమైందన్నారు.

ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంతో పోరాడి నీట్ పరీక్ష రద్దు చేసి తిరిగి నిర్వహించేలా తన గళం విప్పాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రభుత్వాలు అసెంబ్లీల్లో ఇప్పటికే నీట్ రద్దు చేయాలని తీర్మానం చేశాయన్నారు. అదేతరహాలో ఏపీ ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి హెచ్చరిక పంపాలని కోరారు. పేపర్ లీకేజీలు, కుంభకోణాలే మోదీ సర్కార్ మేనిఫెస్టోగా పెట్టుకుందని విమర్శించారు. తక్షణం కేంద్రం ఎన్‌టీఏను రద్దు చేయాలని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కేంద్రప్రభుత్వ, ఎన్‌టీఏ సంస్థ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించిన విద్యార్థి సంఘాల నాయకులను పెద్దఎత్తున మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఒకింత ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ధర్నాలో ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు హరికృష్ణ, అక్బర్, రవి, చంద్ర, నీవన్, ప్రవీణ్, నరేంద్ర, యుగంధర్, మల్లికార్జున, పెద్దసంఖ్యలో విద్యార్థి సంఘాల నాయకులు, నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైం: నూతన చట్టాలపై జిల్లా పోలీస్ సీసీటీఎన్ఎస్ కంప్యూటర్ ఆపరేటర్లకు ఎస్పీ హర్షవర్ధన్ రాజు అవగాహన కల్పించారు. గురువారం పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ కాన్ఫరెన్స్ హాల్లో జూమ్‌లో నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. జూలై ఒకటో తేదీ నుంచి భారత నూతన క్రిమినల్ చట్టాలైన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. నూతన చట్టాల వల్ల ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి ఎస్పీ తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ కొత్త చట్టాలపైన పూర్తిస్థాయిలో అవగాహన రావాలన్నారు. బాధితుడు, ఫిర్యాదారుడు, నిందితుడు, సాక్షులు మొబైల్ నంబర్లు పూర్తి చిరునామా మెయిల్ అడ్రస్‌లను తప్పనిసరిగా సంబంధిత కేస్ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఇందులో ఏఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల సంఖ్య అధికంగా ఉంది. సుమారు 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 69,632 మంది స్వామివారిని దర్శించుకోగా 30,179 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం అవుతోంది.

క్లుప్తంగా

డీజీపీఓగా సుశీలాదేవి



తిరుపతి అర్బన్: జిల్లా గ్రామ పంచాయతీ ఆఫీసర్‌గా (డీజీపీఓ) సుశీలాదేవికి బాధ్యతలు అప్పగించారు. ఆమె ప్రస్తుతం డివిజన్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీఓ)గా పనిచేస్తున్నారు. అంతేకాకుండా జిల్లా సచివాలయాల ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఆమెకు అదనంగా డీజీపీఓ(ఎఫ్ఏసీ) బాధ్యతలు కట్టబెట్టారు. ఆ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. అయితే ప్రస్తుతం జిల్లా గ్రామ పంచాయతీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఏ.రాజశేఖర్‌రెడ్డిని అనంతపురం జిల్లా గుత్తి క్లస్టర్‌లో డ్వామా ఏపీడీగా పంపించారు. ఈ క్రమంలో అధికార పార్టీ నేతలు సిఫార్సులతో ఒక్కొక్కరికి బదిలీలు తప్పవని అంతా చర్చించుకుంటున్నారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరికి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు అందించిన వివరాలు.. శ్రీకాళహస్తి మండలంలోని వాగివేడు గ్రామానికి చెందిన గురవయ్య(37), మరో వ్యక్తితో ఏర్పేడు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. నచ్చనేరి సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గురవయ్యతో పాటు వెనుక కూర్చున్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బైక్ వెనుక వైపునే కూర్చున్న వ్యక్తి వివరాలు తెలియలేదని సీఐ తెలిపారు.

స్వయం ఉపాధితోనే మహిళా అభ్యున్నతి



కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు



బైరాగిపట్టెడలోని అనంగా బ్యూటీ స్టూడియో అండ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు

- ఘనంగా ముగిసిన బ్యూటీషియన్ శిక్షణ
- కోర్సు పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ

తిరుపతి కల్చరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి వారి జీవన ప్రమాణాలు పెంపొందించుకోవడానికి చక్కటి మార్గదర్శినిగా స్వయం ఉపాధి దోహదపడుతుందని సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు తెలిపారు. సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని అనంగా బ్యూటీ స్టూడియో అండ్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళలకు నెల రోజుల పాటు ఇచ్చిన బ్యూటీషియన్ కోర్సు శిక్షణా తరగతులు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతూ వారి అభ్యున్నతికి తోడ్పాటు అందించాలనే ఆకాంక్షతో సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో అనేక స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలు శిక్షణలో మెళకువలను నేర్చుకోవడంతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. నేటి ఆధునిక సమాజంలో ప్రతి మహిళ స్వశక్తితో ఎదుగుతూ కుటుంబానికి బాసటగా నిలవాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్ పాల్గొన్నారు.

మహిళల ఎదుగుదలకు దోహదం..

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు స్వయం ఉపాధి చక్కటి దోహదం. మహిళా అభివృద్ధిని కాంక్షిస్తూ సాక్షి వారు అనేక స్వయం ఉపాధి కోర్సులలో శిక్షణ కల్పించడం శుభపరిణామం. ఇలాంటి ఉపాధి కోర్సులను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తూ తమ కుటుంబాలకు బాసటగా నిలవాలి.

– వై.శ్యామల, శిక్షకురాలు, మాస్టర్స్ ఇన్ కాస్మోటాలజిస్ట్

భవిష్యత్‌పై నమ్మకం వచ్చింది

డిగ్రీ వరకు చదువుకున్నా ఉద్యోగం లేని నాకు నేను అభివృద్ధి సాధిస్తూ స్వయం శక్తి బతకగలననే నమ్మకాన్ని సాక్షి మైత్రి మహిళ వారి బ్యూటీషియన్ శిక్షణ కలిగించింది. ఈ శిక్షణ చాలా బాగుంది. అర్థమయ్యేలా అన్ని విషయాలు నేర్పుతూ మాలో ఎదగాలనే కాంక్షను రేకెత్తించారు. ఇలాంటి శిక్షణలు మహిళల ఉన్నతికి తోడ్పడుతాయి.

– వి.శ్రావణి, అనంతపురం జిల్లా, తాడిపత్రి.

సాక్షికి కృతజ్ఞతలు

సమాజంలో మహిళలు మహారాణులుగా ఎదగాలని, కుటుంబానికి బాసటగా నిలవాలని ఆకాంక్షిస్తూ సాక్షి వారు అందిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ ప్రతి మహిళకు ఎంతో దోహదపడుతుంది. ఇలాంటి శిక్షణా తరగతులు ప్రతి మహిళ జీవితంలో చక్కటి వెలుగును ఇస్తాయి. మరిన్ని స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలతో మహిళలకు సహకారం అందించాలి.

– జి.కీర్తన, అనంతపురం

మనోస్థైర్యాన్ని నింపింది

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఇచ్చిన బ్యూటీషియన్ కోర్సు శిక్షణ నాలో మనోస్థైర్యాన్ని నింపింది. నా కాళ్లపై నేను నిలబడి బతకడంతో పాటు నా కుటుంబానికి తోడ్పాటు అందించగలనన్న నమ్మకం కలిగింది. సాక్షి వారు అందించిన స్ఫూర్తి, సహకారానికి ధన్యవాదాలు.

– వై.మధురిమ, పోస్టల్ కాలనీ, తిరుపతి

సాక్షి సహకారం మరువలేనిది

మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి సాక్షి వారు అందిస్తున్న సహకారం మరువలేనిది. నేను తీసుకున్న బ్యూటీషియన్ కోర్సు శిక్షణతో స్వయం ఉపాధి సాధించి కుటుంబానికి అండగా నిలవగలనన్న నమ్మకం కలిగించింది. స్వయంశక్తితో బతుకుతూ మరింతమంది మహిళలకు స్ఫూర్తిగా నిలిచే అవకాశం ఉంటుంది.

– బి.రేష్మా, చెన్నై

రెండు నెలలుగా మృత్యువుతో పోరాడి..



భరత్‌కుమార్(ఫైల్)

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు దళితకాలనీకి చెందిన నెలబల్లి భరత్‌కుమార్(14) అనే బాలుడు విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడి గత రెండు నెలలుగా మృత్యువుతో పోరాడుతూ చివరికి గురువారం తిరుపతి రుయా ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయాడు. వివరాలు.. గ్రామానికి చెందిన భరత్ కుమార్ మే 19న స్నేహితులతో కలిసి కాలనీ సమీపంలో క్రికెట్ ఆడుకుంటుండగా బాల్ గోడ అవతల పడడంతో తెచ్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో బాలుడి కాళ్లు, చేతులు, శరీర భాగాలు కాలిపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాలో చేర్పించారు. చికిత్సలో భాగంగా వైద్యులు బాలుడి రెండు కాళ్లను తొలగించారు. సుమారు రెండు నెలలుగా మృత్యువుతో పోరాడి చివరకు ప్రాణాలు కోల్పోయాడు. చాలాకాలంగా విద్యుత్ తీగలు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నా, ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి మృతితో కాలనీలో విషాదం నెలకుంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

దేశ నిర్మాణంలో అధ్యాపకులే కీలకం

తిరుపతి సిటీ: దేశ నిర్మాణంలో యువతను భాగస్వామ్యులను చేసే కీలక పాత్ర అధ్యాపకులదేనని వివేకానంద రాక్ మెమోరియల్ కన్యాకుమారి కేంద్రం జనరల్ సెక్రటరీ భానుదాస్ దాకరస్ అన్నారు. గురువారం స్థానిక జాతీయ సంస్కృత వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్, వివేకానంద రాక్ మెమోరియల్ కన్యాకుమారి కేంద్రం తిరుపతి బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో 'విశ్వగురు భారత నిర్మాణంలో అధ్యాపకుల పాత్ర' అనే అంశంపై వర్సిటీలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, స్వామి వివేకానంద మార్గంలో యువత నడవా లని సూచించారు. కార్యక్రమంలో తిరుపతి వివేకానంద కేంద్రం సంచాలకులు చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్, అకడమిక్ ఎఫైర్స్ డీన్ రజనీకాంత్ శుక్లా, ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపల్ రేణు దీక్షిత్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చందూలాల్, ప్రోగ్రాం ఆఫీసర్ కనపాల కుమార్, మోహన్‌రెడ్డి, బాబు రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు.

మీ పిల్లలకీ ఇదే భోజనం పెడతారా..?

- ఎస్వీయూలో నాసిరకం పదార్థాలతో వంటలు దారుణం
- ఆడపిల్లలు అనే మానవత్వం లేదా..!
- ఉమెన్స్ హాస్టళ్లలో సమస్యలను పట్టించుకోరా ?
- అధికారులకు విద్యార్థినుల ప్రశ్నలవర్షం



నాసిరకం భోజనం, హాస్టల్ సమస్యలపై ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌ను ప్రశ్నిస్తున్న విద్యార్థినులు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ ఉమెన్స్ హాస్టళ్లలో వాసన వస్తున్న ఆహారాన్ని తమకు పెడుతున్నారని పీజీ హాస్టల్ విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వర్సిటీ ఏడీ బిల్డింగ్ ఎదుట పెద్దఎత్తున ర్యాలీ అనంతరం విద్యార్థినులు తమ సమస్యలపై అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీలోని లేడీస్ హాస్టళ్లలో బుధవారం రాత్రి వాసన వెదజల్లుతున్న చికెన్‌ను వడ్డించారని, ఏంటి ఇదని హాస్టల్ వార్డెన్‌ను నిలదీస్తే స్పందించలేదని వాపోయారు. మీ ఇళ్లలో పిల్లలకు ఇలాంటి ఆహారం పెడతారా అని అధికారులను నిలదీశారు. తాము నెలకు సుమారు రూ.3 వేలకు పైగా మెస్ బిల్లు చెల్లిస్తున్నా, నిత్యం నాసిరకమైన వంటకాలనే పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పండుగలు వచ్చినా నాసిరకం వడ, పాయసం తప్ప ఇంకేమీ పెట్టరని, ప్రతి రోజూ నీళ్ల పప్పు తప్ప ప్రత్యేకించి కర్రీలు అనే మాట ఉండదన్నారు. కనీసం ఆడపిల్లలు అనే మానవత్వం లేకుండా వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉమెన్స్ హాస్టళ్లలో వాష్‌రూమ్‌లు, వాటర్ సప్లై, తాగునీరు వంటి సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఔటింగ్ పాస్‌లు ఇవ్వడంలో వివక్ష పాటిస్తున్నారని, ప్రధానంగా హాస్టళ్లలో ఉన్న వాచ్‌మెన్‌ల తీరు మరీ దారుణంగా ఉందన్నారు. మహిళలు అని చూడకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

హాస్టళ్లలో సమస్యలను విద్యార్థినులు మా దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో సంప్రదించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా. వర్సిటీలో వీసీ, పూర్తిస్థాయి రిజిస్ట్రార్లను త్వరలో నియమిస్తారు. సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తాను. ఇప్పటికే నాసిరకం భోజనాలపై వచ్చిన ఫిర్యాదులను వార్డెన్‌లు, సిబ్బందితో చర్చిస్తున్నాం. విద్యార్థినులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– చంద్రయ్య, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్, ఎస్వీయూ

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనానికి పవిత్ర జలాలను తీసుకెళ్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 10 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న సాక్షాత్కార వైభవోత్సవాలను పురస్కరించుకుని గురువారం వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతించారు. సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి జూలై 10న పెద్దశేష వాహనం, జూలై 11న హనుమంత వాహనం, జూలై 12న గరుడ వాహనంపై రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా ఎర్రచందనం స్వాధీనం



వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను చూపుతున్న అటవీశాఖ అధికారులు

తిరుపతి మంగళం : అక్రమంగా తరలిస్తున్న వాహనంతో పాటు ఎర్రచందనాన్ని అటవీశాఖ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. తిరుపతి రూరల్ గొల్లపల్లి సమీపంలోని మామిడితోపు వద్ద అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్నట్లు రహస్య సమాచారం అందడంతో ఆ మేరకు బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించినట్లు డీఎఫ్ఓ ఎం.శివకుమార్ తెలిపారు. ఆ ప్రాంతంలో స్ట్రైకింగ్ ఫోర్స్ బీట్ ఆఫీసర్ ఎం.ప్రసాద్‌కుమార్, సిబ్బంది సాయి కిరణ్, షణ్ముగం, మునస్వామి, వినీల్‌కుమార్ తనిఖీలు చేస్తుండగా మహేంద్ర కారు ఏపీ37 టీవీ5666 నంబర్ గల వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 125 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్మగ్లర్లు వాహనాన్ని వదిలేసి పారిపోయారని తెలిపారు.

అల్లూరికి నివాళులు

తిరుపతి క్రైమ్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి ఎస్పీ హర్షవర్ధన్ రాజు నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. దేశాన్ని, ధర్మాన్ని కాపాడుకునే క్రమంలో సర్వస్వం త్యాగం చేసిన మహనీయులను గుర్తు చేసుకోవడం ప్రతి భారతీయుడి ప్రాథమిక ధర్మమన్నారు. అల్లూరి నోటి మాటలు విని అనేక మంది ప్రజలు ఆకర్షితులయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకటరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరాశరేశ్వర బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం సాయంత్రం అంకురార్పణ చేశారు. శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే తొమ్మిది రోజుల ఉత్సవాలకు టీటీడీ ఏర్పాట్లను పూర్తి చేసింది. ఉత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 10 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 7 గంటలకు వాహనసేవ నిర్వహించనున్నారు. గురువారం ఉదయం అర్చకులు ఆలయంలో నిత్యపూజలు చేసి, సాయంత్రం యాగశాలలో గణపతి హోమం, వాస్తు, శాంతి పూజలు చేపట్టి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం గణపతి స్వామివారిని తిరుచ్చిపై పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ సూపరింటెండెంట్ ధర్మయ్య మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 6.45 గంటలకు నందీశ్వరుని చిత్రపటం ఉన్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింప చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అలాగే సాయంత్రం నిర్వహించే స్వామి, అమ్మవారి ఆర్జిత కల్యాణోత్సవంలో రూ.500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు ధర్మయ్య, భరత్, షరాబు శ్రీనివాస షనాయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలోని బంగారు నగలు చోరీ

దొరవారిసత్రం: దుకాణంలో ఉన్న మహిళ మెడలోని బంగారు చైన్‌ను గుర్తు తెలియని ఇద్దరు దుండగులు బలవంతంగా లాక్కుని పరారైన ఘటన గురువారం వెలుగు చూసింది. బాధితురాలు తెలిపిన వివరాలు.. టపాయిండ్లు గ్రామానికి చెందిన అంబికా జాతీయ రహదారి పక్కనే టీ, కూల్‌డ్రింక్స్ షాపు నడుపుతోంది. గుర్తు తెలియని ఇద్దరు దుండగుల్లో ఓ వ్యక్తి దుకాణం వద్దకు వెళ్లి సిగిరేట్ అడిగాడు. ఈక్రమంలోనే ఆమె మెడలోని 5 సవర్ల బంగారు చైన్‌ను లాక్కుని సూళ్లూరుపేట వైపు పరారయ్యారు. బాధితురాలి సమాచారం మేరకు ఎస్ఐ తిరుమలరావు సిబ్బందితో కలిసి గాలించారు. అయితే ఎలాంటి ఆచూకీ దొరకలేదు. నిందితులు తమిళనాడు ప్రాంతానికి చెందిన వారీగా పోలీసులు అనుమానిస్తున్నారు.